కథ

**వి.సత్యవతీదేవి**

# తుది నిర్ణయం

మాధవరావుగారు పోయి ఆ రోజుకు పదిహేను రోజులయింది. కబురు తెలిసిన వెంటనే హైదరాబాద్‌లో ఉన్న పెద్ద కొడుకు సురేష్, రాజమండ్రిలో ఉన్న చిన్నకొడుకు రమేష్ ఇద్దరు కుటుంబాలతో సహా దిగేరు. వాళ్లొచ్చే వరకు శవాన్ని మంచుముక్కల్లో పెట్టి భద్రంగా ఉంచడం, సావిత్రమ్మకు తోడుగా ఉండడంలో మాధవరావుగారి మిత్రులు వాళ్ల కుటుంబాలు చాలా సహకరించాయి. బంధువులు కూడా ఒక్కొక్కళ్లే హాజరయ్యారు.

మాధవరావుగారి మిత్రుల సహకారంతో కొడుకులిద్దరూ కర్మకాండలన్నీ జరగవలసిన రీతిలో యధావిధిగా జరిపించారు. బంధువులందరూ ఎవరి గూళ్లకు వారు చేరుకున్నారు. రమేష్, సురేష్ కూడా పెట్టిన సెలవులు అయిపోవడం వల్ల వాళ్లవాళ్ల ఊళ్లకు వెళ్లే ప్రయత్నంలో ఉన్నారు.

అయితే రెండు రోజుల బట్టి ఇద్దరు కొడుకులు, ఇద్దరి కోడళ్ల మధ్య వాగ్వివాదం ఏదో జరుగుతోంది. సావిత్రమ్మకు అర్థం కావడం లేదు. తనని చూసేటప్పటికి మాటలాపేసి వేరే టాపిక్‌లలోకి వెళ్లిపోతున్నారు.

అసలే సావిత్రమ్మ మనసు అల్లకల్లోలంగా ఉంది. భర్త చనిపోయే ముందురోజు దాకా ఉల్లాసంగా తిరిగారు. మీకు శనగపిండి పడదన్నా వినకుండా అరటికాయ బజ్జీలు వేయించమని ఇష్టంగా తిన్నారు. రాత్రి తాను తరువాత తింటానన్నా వినకుండా కలిసే తిందామంటూ బలవంతం పెట్టి భోజనానికి అతనితోపాటు కూర్చునేదాకా ఒప్పుకున్నారు కాదు.

మరునాడు ఉదయమే స్నానం చేసి దైవప్రార్థన చేసుకొని టిఫిన్ చేసి అలా తిరిగి వస్తానంటూ వెళ్లిన మనిషి శవమై తిరిగి వచ్చారు. రోడ్డుమీద పడిపోతే తెలిసిన వాళ్లు ఇల్లు చేర్చారు. హార్ట్‌ఎటాకట దాని పేరు.

పదహారవ ఏట పెళ్లయిన తనకిప్పుడు అరవై రెండేళ్లు. ఈ నలభై ఆరేళ్ల సహజీవనంలో ఏనాడు తమిద్దరి మధ్య పొరపొచ్చం రాలేదు. ఒకే మాట మీద ఒకే బాటలో నడిచారు. అలాంటిది నేడు తనని వంటరిదాన్ని చేసిపోతే ఎలా బ్రతుకుతాననుకున్నారు. సావిత్రమ్మకు దుఃఖం పొర్లి వస్తోంది.

ఇద్దరు కొడుకులున్నారు. ఒకడు ఇంజనీరు. వాడి భార్య కూడా ఇంజనీరే. వాడే పెద్ద వాడు. హైదరాబాద్‌లో ఉంటాడు. రెండో వాడు రమేష్. రాజమండ్రిలో బ్యాంక్ మేనేజర్‌గా ఉంటాడు. వాడి భార్య ఇంటర్ వరకే చదివింది. ఇద్దరు కొడుకుల్ని వాళ్లు కోరిన చదువులు చదివించడానికి స్థోమత లేకపోయినా కడుపు కట్టుకొని మరీ చదివించారు. కాని కట్నం కోరకుండా వాళ్లు కోరుకున్న పిల్లలతో పెళ్లిళ్లు జరిపించారు. ఇద్దరూ ఇద్దరేసి బిడ్డల తండ్రులయ్యారు. కానీ ఏనాడు అమ్మా, నాన్నా నాలుగు రోజులు మా ఇంటికొచ్చి ఉండండి అని అనలేదు.

పెద్ద కోడలికి పల్లెటూరి వాసనలు గిట్టక పెళ్లయిన తరువాత మరి తమ గడప తొక్కలేదు. ఏడాదికొకసారే కొడుకే పిల్లల్ని తీసుకొచ్చి చూపించి వెళ్లిపోయేవాడు.

రెండోవాడు భార్యాపిల్లలతో అప్పుడప్పుడొచ్చినా తల్లిదండ్రుల కష్ట సుఖాలేమిటో అడగకపోగా తన కష్టాలే ఏకరువు పెట్టి తండ్రి దగ్గరు నుంచే కాస్తో కూస్తో పట్టుకుపోయేవాడు.

అతను రిటైర్ అయి ఎనిమిదేళ్లు గడుస్తున్నా మీ ఆర్థిక పరిస్థితులేమిటని ఏనాడూ ఏ కొడుకు అడగలేదు.

ఇప్పుడిక నా పరిస్థితి ఏమిటని సావిత్రమ్మకు దిగులు పట్టుకొంది. అతని పెన్షన్ వస్తుంది. జీవనానికి లోటు లేదు. కానీ ఈ వయస్సులో ఎవరి సహాయం, ఎవరి ఆప్యాయతతో కూడిన పలకరింపులేక తాను వంటరిగా జీవించగలదా? ఏ కొడుకైనా వాళ్లతో రమ్మని పిలిస్తే బాగుండును. ఏ కొడుకు దగ్గరకెందుకొచ్చినా తనని వాళ్లతో రమ్మని పిలవడానికే వచ్చాడనుకుంటోంది.

ఆలోచనలతో సావిత్రమ్మకు ఏ తెల్లవారుజామునో నిద్ర పట్టింది.

○○○

పిల్లల కేకలతో, ఇంట్లో గిన్నెల శబ్దాలతో సావిత్రమ్మకు మెలకువ వచ్చింది. లేచి కాలకృత్యాలు తీర్చుకొని స్నానం చేసి పెద్ద కోడలు పట్టుకు వచ్చిన కాఫీ గ్లాసు అందుకుంది. కోడలు ఇంకా వెళ్లకుండా అక్కడే నిలుచుండడం చూసి ఆమె ఏదో చెప్పడానికి సంశయిస్తోందని గ్రహించింది సావిత్రమ్మ.

"ఏంటమ్మా ఏమైనా చెప్పాలా?" అంది మృదువుగా.

"ఏం లేదత్తయ్యా... మామగారు పోయాక మీరిక్కడ వంటరిగా ఎందుకు? మాతో పాటు హైదరాబాద్ వచ్చెయ్యండి" అంది మెల్లిగా.

"నేనా..మీతో పాటా..?" నమ్మలేనట్లు చూసింది.

"అవునమ్మా... ఇక్కడే ఉంటే నాన్నగారిని తలచుకుంటూ ఏడుస్తూ కూర్చుంటావ్. స్థలమార్పు కొంచెం ఉంటే బాగుంటుంది కదా. పిల్లలతో నీకు కాలక్షేపం అవుతుంది" ఎప్పుడొచ్చి నిలబడ్డాడో పెద్దకొడుకు అందుకున్నాడు.

సావిత్రమ్మ కళ్లు ఆనందంతో మెరుస్తున్నాయి. తన మొర భగవంతుడాలకించినట్టు ఉన్నాడు. కొడుకు తనని రమ్మంటున్నాడు. ఎప్పుడూ ఆప్యాయంగా మాట్లాడని కోడలు కూడా ప్రేమతో రమ్మని పిలుస్తోంది.

"చూద్దాంలే నాయనా"

"చూద్దాం అంటే కుదరదమ్మా. రేపు పది గంటల ట్రైనుకే ప్రయాణం. బట్టలు అవి సద్దుకో" అంటూ మారుమాటకి తావివ్వకుండా ముందుకు నడిచేడు సురేష్.. భార్య అనుసరించింది.


సావిత్రమ్మ మనసు ఉబ్బితబ్బిబ్బవుతోంది. అరగంట గడిచిందో లేదో రమేష్, భార్య మెల్లిగా ప్రవేశించారు.

"అమ్మా.. నువ్వు మాతో పాటే రావాలి. పిల్లలు నానమ్మ, నాన్నమ్మ అంటూ ఒకటే గోల చేస్తున్నారు"

"అవునత్తయ్యా.. హైదరాబాద్‌లో మీరుండగలరా.. ఎక్కడికెళ్లాలన్నా మీకు తోడుండాలి. వాళ్లిద్దరూ ఉద్యోగస్తులు. మిమ్మల్ని తిప్పే తీరిక వాళ్లకెక్కడిది. వాళ్లు ఉద్యోగాలకి, పిల్లలు స్కూల్‌కి వెళ్లిపోతే అక్కడ మీరు వంటరే. ఈ బాధంతా ఎందుకు.. హాయిగా గోదావరి స్నానాలు.. మా ఇంటిపక్కనే శివాలయం ఉంది. రోజూ మీకు బోలెడంత కాలక్షేపం తప్పకుండా మాతోపాటే రండి"

"అవునమ్మా.. ఇంకేం ఆలోచించకు. నువ్వు మాతో పాటే వస్తున్నావ్" అంటూ భార్య అడుగుజాడల్లో బయటికి నడిచాడు రమేష్.

ఇద్దరి కొడుకులకి, కోడళ్లకి తన మీద ఉన్న ప్రేమకి సావిత్రమ్మ మనసు ఆనందంతో పరవళ్లు తొక్కుతోంది.



'అతనేం పాపం చేసుకున్నారు

పిల్లలు ఇంత ప్రేమతో పిలవడం అతనెప్పుడూ వినలేదు. బహుశా తనే ముందు చనిపోతే అతన్ని జాలితో ఇలా పిలిచేవారేమో... అతనికి పిల్లంటే ప్రాణం. పిల్లలు ఉద్యోగస్తులయినా కూడా వాళ్ల సంపాదనకేనాడు ఆశపడలేదు. పైగా వాళ్లకే పండగలకని పబ్బాలకని ఖర్చు పెట్టేవాడు. ఇన్ని సంవత్సరాల బట్టి ఉద్యోగాలు చేస్తున్నా ఒక్కసారి కూడా తమని రమ్మని పిలవలేదు. ఆడది కాబట్టి మనసుండబట్టలేక అప్పుడప్పుడు భర్తతో తనే 'ఏమిటండీ వాళ్లిద్దరూ ఇన్ని సంవత్సరాల బట్టి ఉద్యోగాలు చేస్తున్నా ఒక్క పది రోజుల పాటు మనని తమతో పాటు ఉండమని పిలవరేమండీ' అనేది బేలగా.

దానికి ఆయన చిరునవ్వుతో 'ఫోవే.. పిచ్చిదానా.. పాపం వాళ్లే ఆ మహా పట్నాలలో, ఆ ఇరుకు కొంపల్లో సంసారాలు నెట్టుకొస్తూంటే మనమెందుకు వాళ్ల పీకలమీదకి. అయినా మనకిక్కడ ఏం తక్కువయిందే' అనేవారు.

సావిత్రమ్మ ఏ కొడుకు దగ్గరకెళ్లాలో తేల్చుకోలేకపోతోంది. ఇద్దరూ పిలిచారు. ఒకళ్ల దగ్గరకెళితే ఒకళ్లు మనసు కష్టపెట్టుకొంటారేమో. అమ్మకి తన మీద ప్రేమ లేదని అనుకొంటారేమో.

పిచ్చి సన్నాసులు.. అమ్మ ప్రేమ బిడ్డలందరి మీద ఒకే విధంగా ఉంటుందని వాళ్లు తండ్రులయ్యారు. వాళ్లకి తెలీదా..

అంతగా లేదు అనుకుంటే చెరి ఆరు నెలలు ఒక్కొక్కరి దగ్గర ఉండొచ్చు. ముందే కొడుకుతో వెళ్లాలి. సావిత్రమ్మ మనసు మళ్లీ ఆలోచనలో పడింది.

అరగంటకో సారి ఇద్దరి కొడుకులు, కోడళ్లు ఒక్కళ్లకి తెలీకుండా ఒకళ్లు వచ్చి బట్టలు సర్దుకొన్నారా అని అడుగుతూనే ఉన్నారు.

నాకు సర్దుకొందుకేముందమ్మా. నాలుగు చీరలు పడేసుకోడమేగా అంటోంది సావిత్రమ్మ.

పెందరాళే రాత్రి భోజనాలు కానిచ్చి ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్లిపోయారు.

పగలంతా నిద్ర లేకపోవటం, ఆలోచనలతో మెదడుకి విశ్రాంతి లేకపోవడం వల్ల సావిత్రమ్మకి కూడా తొందరగానే నిద్ర పట్టేసింది.

○○○

అర్ధరాత్రి సావిత్రమ్మకి సడన్‌గా మెలకువ వచ్చేసింది. దాహంతో నాలుక పిడచకట్టుకొని పోతుందేమో అనిపించింది. టైము చూసింది పన్నెండున్నర అయింది. మంచినీళ్లు త్రాగుదామని గది తలుపు తీసుకొని వంటింటి వైపు నడిచింది.

చిన్నకొడుకు గదిలోంచి మాటలు వినిపించేయి. 'అత్తగారు'

అని కోడలేదో అంటోంది. ఇంత అర్ధరాత్రప్పుడు వీళ్ళ తన గురించి ఏమిటి మాట్లాడుకుంటున్నారా అని ఆశ్చర్యపోయింది. తప్పనా తెలిసిన కుతూహలం కొద్దీ తలుపుకు ఒక చెవి ఆనించింది.

"ఏమిటండీ.. మీ వదినగారి ఆధిపత్యం. ఎంత ఉద్యోగస్తురాలయితే మాత్రం ఆవిడ మాటే చెల్లాలంటుందేమిటి... ఇద్దరూ ఉద్యోగస్తులు. బోలెడంత సంపాదన. ఆ మాత్రం వంటమనిషిని పెట్టుకోలేరూ. ఆ మాటే అడిగితే 'వంట మనిషి ఇంటి మనిషి చేసినట్టు చేస్తుందా? అయినా ఈవిడ ఇక్కడ ఉండి ఊడబొడిచేదేముంది. పిల్లలు కూడా సాయంకాలం ఇంటికొచ్చేటప్పటికి ఏదైనా తినడానికంటారు. బజారు వస్తువులు తింటే వాళ్ల ఆరోగ్యాలు పాడవుతాయి. అత్తగారే అక్కడుంటే మాకు సదుపాయంగా ఉంటుంది కదా' అంటుంది వగలుపోతూ"

"అవునే అన్నయ్యా ఆ మాటే నాతో అన్నాడు. అమ్మ అక్కడ ఉంటే ఇల్లంతా చక్క పెట్టుకొని పనిపాటలు చూసుకొంటుంది. సరోజకి కాస్త అవస్థ తప్పుతుందని"

"చూశారా వాళ్లెంత ప్లానుతో ఉన్నారో...అక్కడికి మనకే అవసరం లేదు పాపం. నేను సరే ఆరోగ్యం సరిగా లేనిదాన్ని. ఆ సంగతి మీకు తెలుసు కదా. ఇప్పటికే ఇంటిచాకిరీతో, పిల్లల సంరక్షణతో కొట్టుమిట్టాడుతున్నాను. వీళ్లలాగా మనకి వంటమనిషిని పెట్టుకునే తాహతు లేదు. ఆవిడకు మనతో తీసుకెళ్లి నాకు చాకిరీ తప్పడమే కాక మామగారి పెన్షన్ ఆవిడే చేసుకొంటుంది. మనకే అది దక్కుతుంది. విలువైన వస్తువులేమీ మనం కొనుక్కోలేకపోయాం. ఇప్పుడైనా కొనుక్కుందికి కొంత వెసులుబాటు ఉంటుంది"

"అబ్బ.. ఏం బుర్రే నీది. ఆ మాటే నేను ఆలోచించలేదు. అన్నయ్య, వదిన అమ్మను తీసుకెళదామని పట్టుదలతో ఉన్నారు. రేపు నేను అటో ఇటో తేల్చేస్తానుండు"

"ఆ.. మీ ఒక్కరి వల్ల ఏమవుతుంది. మీ వదిన మాటలు గారడి చేస్తుంది. నేనక్కడ ఉన్నప్పుడే ఆ టాపిక్ ఎత్తండి. ఆవిడ బండారం నేను బయటపెడతా"

సావిత్రమ్మ కాళ్లు గజగజ వణుకుతున్నాయి. దాహం మాట మరిచిపోయింది. ఎలా చేరుకొందో మంచం మీదకి చేరి వాలిపోయింది. కొడుకు, కోడలు మాటలే ఆమె చెవుల్లో గింగురుమంటున్నాయి.

దుఃఖం పొర్లుకుపొర్లుకు వస్తోంది. ఏమిటీ వీళ్లు నన్ను పిలిచింది ప్రేమతో కాదా.. ఒకళ్లకి ఇంట్లో వంట మనిషిగా అవసరం, ఇంకొకళ్లకి పనిమనిషి ప్లస్ వంటమనిషి ప్లస్ ఎదురు డబ్బిచ్చే మనిషి. భేష్... పిల్లలకి నా మీద ఎంత ప్రేమని మురిసిపోయింది. ఇదా వీళ్ల ప్రేమ. ఈ ప్రేమ వెనకాల ఇంత స్వార్థం ఉందా? వీళ్ల మనసుల్లోని కుళ్లు తెలుసుకోకుండా వెళ్లిపోయిన ఆయన ఎంతో అదృష్టవంతులు. ఇప్పుడు తన కర్తవ్యం ఏమిటి? మూగగా రోదిస్తూనే ఆలోచనల్లో పడింది సావిత్రమ్మ.

ooo

తెల్లవారింది. కొడుకులిద్దరూ ప్రయాణ సన్నాహాల్లో ఉన్నారు.

హాల్లోంచి పెద్దకొడుకు చిన్న కొడుకు ఏదో పెద్దగా కేకలు వేసుకుంటున్నారు.

"అమ్మని మీరు తీసుకెళ్తానంటే మేం ఏం కావాలి అమ్మ అవసరం మాకూ ఉంది" చిన్నకొడుకు గట్టిగా వాదిస్తున్నాడు.

"మరిదిగారూ.. మీ ఆవిడ ఇంట్లోనే ఉంటుందిగా.. అత్తగారు మా ఇంట్లో ఉంటే మాకు పెద్దదిక్కుగా ఉంటారు" ఇంకా ఏదో అనబోతూంది చిన్నకోడలు గయ్‌మని లేచింది.

"ఇదంతా ఎందుకు తమ్ముడూ మధ్యేమార్గం నేను చెబుతాను. అమ్మని చెరి ఆరు నెలలు ఉంచుకొందాం. అమ్మ పెరట్లో ఉంది. ఈ ఘర్షణ ఆమె చెవిలో పడుతుంది. బాగుండదు. ఇంక ఆ ప్రసక్తి ఆపేయండి. అమ్మ రాగానే ఎవరితో ముందు బయలుదేరుతుందో ఆమెనే అడుగుదాం. అది ఆమె ఇష్టానికే వదిలేద్దాం"

సావిత్రమ్మ అడుగుల చప్పుడు విని అంతా స్తబ్దుగా అయిపోయారు.

"అమ్మా" పిలిచాడు పెద్దకొడుకు.

ఏమిటన్నట్టు చూసింది సావిత్రమ్మ.

"మాతో రమ్మంటే ఆమె మాకు మాత్రం తల్లికాదా అని తమ్ముడు బాధపడుతున్నాడు. అందుకే మేం ఒక నిర్ణయానికొచ్చాం"

"ఆగు బాబూ.." మధ్యలోనే అడ్డుకుంది సావిత్రమ్మ.

"చెరి ఆరు నెలలు నన్ను పంచుకొందుకి మీరు నిర్ణయించుకున్నారు. కానీ నా నిర్ణయం వినండి. నేనెవరితోనూ రాను. నాన్నగారు కట్టించిన ఈ ఇంట్లో, నాకొచ్చే పెన్షన్‌తో నా బ్రతుకు నేను బ్రతుకుతాను" అంది దృఢ నిశ్చయంతో.

"అదేమిటండీ. ఎప్పుడూ ఈ బలం, ఈ ఆరోగ్యం ఉండవు కదా. అప్పుడు చాకిరీ చేయించుకొందుకి కోడళ్ల దగ్గరకొస్తారా?" అడిగింది పెద్దకోడలు వెటకారంగా.

"లేదమ్మా.. ఆ భయం మీకొద్దు. నా కాలు చెయ్యి ఇక పని చెయ్యవు అనిపించిన నాడు ఏ దాతల ద్వారానో ఏ ఆశ్రమంలోనో చేరిపోతాను. కానీ మిమ్మల్ని ఇబ్బంది పెట్టను. అంతవరకూ ఇక్కడే ఉంటాను. మీకు ఎవరికైనా నన్ను చూడాలనిపిస్తే నిరభ్యంతరంగా రావచ్చు, వెళ్లొచ్చు"

"అమ్మా"

"వద్దు నాయనా. మీ మాటలన్నీ విన్నాను. ఇంకేం మాట్లాడొద్దు.. ఇదే నా తుది నిర్ణయం" అంటూ సావిత్రమ్మ తన గదిలోకి వెళ్లిపోయి తలుపులు దగ్గరకేసుకుంది.

o

## దీపిక చిలకపలుకులు!

దీపికా పదుకొనే తాజా బాయ్‌ఫ్రెండ్ రణబీర్ కపూర్ అనే సంగతి బాలీవుడ్డంతా కోడై కూస్తోంది కదా! ఈ నేపథ్యంలోనే దీపిక మాట్లాడుతూ- 'నిజంగా రిషీ అంకుల్ (రణబీర్ తండ్రి) ఎంతో మంచివారు. అలాగే నీతూ ఆంటీ కూడా చాలా ఫ్రెండ్లీగా వుంటారు. నేను చిన్నప్పటి నుంచీ రిషీ కపూర్ వీరాభిమానిని. కానీ ఇలా రణబీర్‌తో కలిసి వాళ్లను కలుస్తానని కలలో కూడా అనుకోలేదు. తరచూ నేను వాళ్లింటికి రణబీర్‌తో కలిసి వెళుతున్నాను. అసలు మా నాన్న ప్రకాష్ తనని తాను అప్పట్లో రిషీకపూర్‌లా వుంటానని చెప్పుకునేవారు' అని ముసిముసిగా నవ్వుతోంది దీపిక.

